# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ వివిధ కన్సల్టెన్సీలతో ఈరోజు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంది.
- రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు సన్నద్ధంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు.
- వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.
- భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న 4వ టెస్ట్ మ్యాచ్‌లో 3వరోజు భోజన విరామ సమయానికి ఇంగ్లండ్ 2 వికెట్ల నష్టానికి 332 పరుగులు చేసింది.

===================

పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాష్ట్ర సచివాలయంలో జీరో పావర్టీ పీ4పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను కూడా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నానని వెల్లడించారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు కానున్నారని చెప్పారు. పీ4 కార్యక్రమం విజయవంతమయ్యేలా అన్నిచోట్లా అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని, ప్రవాసాంధ్రులను కూడా భాగస్వామం చేసేందుకు ఏపీ ఎన్నార్టీ సొసైటీ సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

===================

విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ వివిధ కన్సల్టెన్సీలతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈరోజు విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ సమక్షంలో సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. విజయవాడ మెట్రో డిజైన్ లు, సాంకేతికత, పనుల పర్యవేక్షణ కోసం టిప్సా సంస్థ తోను, విశాఖకు శిస్ట్రా కన్సల్టెన్సీలతోనూ ఎంఓయూ కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విశాఖ, విజయవాడలో మెట్రో రైళ్ల నిర్మాణం ప్రతిపాదించారని తెలిపారు. వాహన ట్రాఫిక్ నివారణకు మెట్రో రైళ్ల నిర్మాణం మాత్రమే పరిష్కారమన్నారు. మూడేళ్లలో విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలియజేశారు.

===================

రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై హోంమంత్రి వంగలపూడి అనిత విపత్తు నిర్వహణ ఎండీ ప్రఖర్ జైన్, సిబ్బందితో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాయుగుండం రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ దిశగా కదులుతుందని అన్నారు. ఎల్లుండి వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు.. రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే తీరం వెంబడి గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఉత్తరాంధ్ర జిల్లాల తీర ప్రాంతాల్లో సముద్రపు అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడవచ్చని తెలిపారు. వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి అనిత సూచించారు.

==================

వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈరోజు ఆయన పర్యటించి, నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాలెంలో 85 లక్షల రూపాయల ఖర్చుతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. వచ్చే నెల 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. పరిశ్రమలను స్థాపించి, నిరుద్యోగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

==================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==================

విరామం

==================

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రవాణా, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈరోజు ఆయన బాపట్ల ఏపీఎస్ఆర్టీసీ బస్ డిపోను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్న అతిపెద్ద సంస్థ ఏపీఎస్ ఆర్టీసీ అని అన్నారు. ఆర్టీసీ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఆర్టీసీ సంస్థను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతామన్నారు. సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్...26 సెకన్లు)

==================

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ గ్రాండ్‌మాస్టర్ సెమీస్‌లో కోనేరు హంపి అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరింది. నిన్న రాత్రి టైబ్రేక్‌లో హంపి 5-3తో విజయం సాధించింది. ఈ సందర్భంగా కోనేరు హంపికి గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలియజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు. కాగా.. కోనేరు హంపి ఫైనల్‌కు చేరుకోవడం పట్ల శాప్ ఛైర్మన్ రవి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. వరల్డ్ కప్ ఫైనల్లో అడుగుపెట్టిన తొలి ఇండియన్‌గా హంపి ఘనత సాధించిందని పేర్కొంటూ.. ఫైనల్లో ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు.

==================

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్.. కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. 1999 నాటి కార్గిల్ యుద్ధం... భారత సాయుధ దళాల అచంచలమైన ధైర్యసాహసాలు,

దృఢ సంకల్పానికి శక్తివంతమైన చిహ్నంగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సైనికులు ప్రదర్శించిన ధైర్యం, పరాక్రమం, నిబద్ధత.. భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

===================

వైద్య వృత్తిని సేవగా భావించి నిరుపేదలకు సహాయపడాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి వైద్య విద్యార్థులకు సూచించారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అలుమ్ని ఆడిటోరియంలో ఈరోజు జరిగిన వైద్య విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులు విద్యను పూర్తి చేసిన తరువాత సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలని సూచించారు. ధనార్జన ప్రక్కనపెట్టి, సేవాదృక్పథంతో పనిచేస్తే సమాజంలో వైద్యులకు మరింత విలువ పెరుగుతుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం గత 3 గంటల్లో గంటకు 13 కిటోమీటర్ల వేగంతో పశ్చిమ బెంగాల్ ను ఆనుకుని ఉన్న  తీరాలను దాటింది. ఇది రాబోయే 24 గంటల్లో గంగా నది పశ్చిమ బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, జార్ఖండ్ మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

===================

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో మూడవరోజు భోజన విరామ సమయానికి ఇంగ్లండ్ 2 వికెట్లు నష్టపోయి 332 పరుగులు చేసింది.

===================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,184 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 721 పాయింట్ల నష్టంతో 81,463 వద్ద ముగియగా.. నిఫ్టీ 225 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద స్థిరపడింది.

===================
===================